క్లుప్తంగా

'సింధూర్ డిపాజిట్'ను సద్వినియోగం చేసుకోండి

శిరివెళ్ల: సింధూర్ డిపాజిట్ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుకాదేవి అన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జూలై 15 వరకు పథకం అమలులో ఉం టుందన్నారు. 333 రోజులకు డిపాజిట్ చేసు కోవచ్చన్నారు. సీనియర్ సిటిజన్లకు 7.06 శాతం, 60 ఏండ్లు లోపు వారికి 6.54 శాతం వడ్డీ వస్తుందన్నారు. రూ. 5 లక్షల వరకు డిపా జిట్ ఇన్సూరెన్స్ సౌకర్యం ఉందన్నారు.

28న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): గెలివి పాఠశాలలో ఈనెల 28న జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహి స్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ వశిష్ట సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర చెస్ అసోసి యేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల కోసం బాలబాలిక లకు వేర్వేరు విభాగాల్లో చెస్ పోటీలు నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం ఏపీ చెస్ వెబ్ సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జూలై 12, 13 తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరింత సమా చారం కోసం సెల్ : 90104 51585 నంబరుకు సంప్రదించాలన్నారు.

నేడు దైవ సేవకుల సదస్సు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఏసుకృ ప మినిస్ట్రీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దైవ సేవకుల సదస్సును జేకే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్టు చైర్మన్ బ్రదర్ అందనం ఏసన్న తెలి పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సదస్సుకు ముఖ్యఅతిథులుగా మండపేట ప్రాంతం నుంచి ధర్మవీర్‌పాల్, దైవజనురాలు సిస్టర్ ధర్మవీల్‌పాల్ హాజరై సందేశం అందిస్తా రని, జిల్లాలోని దైవ సేవకులందరూ పాల్గొ నాలని కోరారు.

బేస్ బాల్ జట్ల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29వ తేదీన రామ కృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో నంద్యాల జిల్లా సీనియర్ బేస్ బాల్ స్త్రీ, పురుషుల జట్ల ఎం పిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ చైర్మన్ బాబులాల్, కార్యదర్శి సుబ్బయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి బేస్ బాల్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జూలై 12 నుంచి 14వ తేదీ వరకు అనంతపురం జిల్లాలోని కదిరిలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ బేస్‌బాల్ చాంపియన్‌ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 98858 59183 నంబ రును సంప్రదించాలన్నారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని మహి ళా సర్పంచ్‌లకు మంగళవారం నుంచి మూ డు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. భీమవరం, బిల్లలాపురం, చా బోలు, గుంతనాల, పాండురంగాపురం, కానా ల,రాయమాల్పురం గ్రామాలకు చెందిన మ హిళా సర్పంచ్‌లకు స్థానిక ఎంపీడీఓ కార్యాల య భవనంలో నిధులు, విధులు, బాధ్యతలపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ప్రతి సర్పంచ్ ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

యునాని డాక్టర్ నియామకం

శిరివెళ్ల: స్థానిక యునాని వైద్యశాలకు డాక్టర్‌గా షమీమ్ ఉనీషా నియమితులయ్యారు. గతే డాదిగా డాక్టర్ లేక ప్రజలకు సరైన వైద్యం అం దలేదు. నూతన డాక్టర్ నంద్యాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నేడు ఆత్మీయ సమావేశం

నంద్యాల(అర్బన్): స్థానిక టెక్కె భరతమాత గుడి సమీపంలోని విశ్వహిందూ పరిషత్ కార్యా లయంలో మంగళవారం నారద మహర్షి జయం తిని పురస్కరించుకొని ఆత్మీయ సమావేశం నిర్వ హిస్తున్నారు. ఈ విషయాన్ని సోమవారం కార్య క్రమం నిర్వాహకులు చింతలపల్లె వాసు, శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దయమ్మనూరు పీహెచ్‌సీకి వైద్యాధికారి నియామకం

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మ నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యాధికా రిగా నాగమస్తాన్‌ను నియమిస్తూ జిల్లా వైద్యా ధికారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వైద్యశాలలో వైద్యాధికారులుగా పని చేస్తున్న శివలింగమ్మ, దుర్గాదేవి పీజీ కోర్సులు చేసేందుకు వెళ్లారు. అహోబిలం వైద్యాధికారిగా విధులు నిర్వహి స్తున్న నాగమస్తాన్‌ను పెద్దయమ్మనూరుకు బదిలీ చేశారు. అలాగే ఈ ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న రాజశేఖర్‌ను నంద్యాలకు బదిలీ చేశారు. ఈయన స్థానంలో గోస్పాడు పీహెచ్‌సీ నుంచి కిశోర్ నాయక్‌ను నియమించారు. ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎన్ విధులు నిర్వహి స్తున్న లక్ష్మీదేవి, సబార్డినేటర్‌గా విధులు నిర్వహి స్తున్న రాజమ్మను దొర్నిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, ఎల్‌డీ కంప్యూటర్ రేవతిని గడి వేముల పీహెచ్‌సీకి బదిలీ చేశారు.

దక్కని భరోసా!

- గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులకు పెట్టుబడి సాయం
- కూటమి పాలనలో ఆ ఊసేలేని వైనం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అమలు కాని అన్నదాత సుఖీభవ

వైఎస్సార్‌సీపీ పాలనలో వరుసగా ఐదేళ్లు రైతు భరోసా కింద రైతులకు అందిన సాయం వివరాలు

సంవత్సరం	రైతులు	చెల్లించిన మొత్తం రూ.కోట్లలో
2019-20	6,493	4.87
2020-21	6,541	4.90
2021-22	6,598	4.95
2022-23	6,661	5.00
2023-24	5,957	4.46

గోస్పాడు: ఆరుగాలం కష్టించే అన్నదాతను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. పెట్టుబడి సాయం అందించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం అందేది. దీంతో రైతులు ధైర్యంగా పంట సాగు చేసుకునే వారు. కూటమి పాలనలో అప్పులు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే ఖరీఫ్‌సీజన్ ప్రారంభమై నెల వుతుంది. గోస్పాడు మండలంలో ఈ సీజన్‌లో 6,500 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తారు. కేసీ కాల్వ పరిధిలో రైతులు వరిపైరు సాగు చేస్తుం టారు.మెట్ట పొలాల్లో కంది, పెసర, మినుము, సోయాబీన్, మొక్కజొన్న వేస్తారు.

గతంలో సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే రైతుల అకౌంట్లలో రైతుభరోసా కింద పెట్టుబడి సాయం జమయ్యేది. జూన్‌లో ప్రారంభమయ్యే ఖరీఫ్‌కు మే నెలలోనే రూ.7,500 చొప్పున ప్రతి రైతుకు అందేది. రబీ సీజన్ ప్రారంభంలో అంటే అక్టోబర్‌లో రూ. 4వేలు, జనవరినెలలో మరో రూ.2వేల సాయాన్ని ప్రభుత్వం అందించేది. ఇలా గత ఐదేళ్లు వరుసగా రైతులకు పెట్టుబడి సాయం అందింది. భూమి కలిగిన రైతులతో పాటు కౌలుదారులకు కూడా జగన్ సర్కారు రైతు భరోసా సాయాన్ని అందించి ఆదుకుంది.

ఏడాది గడిచినా అమలు కాని హామీ

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరోలా వ్యవహరి స్తోంది. ఎన్నికలకు ముందు ప్రతి రైతుకు అన్న దాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని ప్రకటించింది. ఇప్పుడు దీనిపై సీఎం చంద్రబాబునాయుడు నోరు మెదపడం లేదు. 2024 జూన్‌లో పైసా సాయం అందించలేదు. కనీసం ఈ ఏడాదైనా అన్నదాత సుఖీభవ పథకాన్ని



ఖరీఫ్ సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

అమలు చేస్తుందేమోనని రైతులు ఆశిస్తే ఇప్పటి వరకు అతీగతీ లేదు. వ్యవసాయ సీజన్ ప్రారంభ నెలగడుస్తున్నా సాయంపై స్పష్టమైన ప్రకటన లేదు. దీంతో రైతులు పంటసాగుకు ఆర్థికంగా ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. కొందరు సన్నకారు రైతులు, కౌలుదారులు విత్తనాలు, ఎరువులు తదితర వాటి కొనుగోలు కోసం వడ్డీ వ్యాపారు లను ఆశ్రయిస్తున్నారు.

మాట నిలబెట్టుకోవాలి



రైతులకు ప్రభుత్వం ఇస్తా నన్న రూ. 20 వేలు సాయాన్ని వెంటనే అం దించాలి. ఎన్నికల ముం దు కూటమి నాయకులు మాట ఇచ్చారు. అధికా రంలోకి వచ్చి ఏడాది గడిచినా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకపోవడం సరికాదు. రైతులు పంట పెట్టుబడుల కోసం బ్యాంకులను, ప్రైవేట్ వ్యక్తుల వద్దకు పోవాల్సి వస్తుంది. సాయం అందజేసి మాట నిలబెట్టుకోవాలి.

–చెన్నయ్య, సీపీఎం నాయకుడు

పెట్టుబడులకు ఇబ్బందులు



ఖరీఫ్ సీజన్ మొదలైంది. పంట సాగుకు పెట్టుబ డుల కోసం కొంత ఇబ్బం దులు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో పం టల సాగు మొదలవగానే మాకు అకౌంట్లో రైతు భరోసా డబ్బులు పడేవి. ఈ సొమ్ము ఎరువులు, విత్తనాలు వంటివి కొనుగోలు చేసేందుకు ఆస రాగా ఉండేది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. గతేడాది కూడా పైసా రాలేదు.

–మద్దిలేటి, రైతు,గోస్పాడు

ప్రజా వినతులకు పరిష్కారం చూపండి



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ రామునాయక్

నంద్యాల: ప్రజల వినతులకు సత్వరం పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూ లాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీ లించి నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అదే రీతిలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదు లను విథిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో రీఓపెన్ అయిన దరఖాస్తులపై ప్రత్యేక దృ ష్టి సారించాలని చెప్పారు. బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేం దుకు ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల న్నారు. గ్రామ సచివాలయ సర్వీసులకు సంబంధిం చి ఆధార్ సీడింగ్ త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న మన మిత్రకు సంబంధిం చిన నమోదు కూడా పూర్తి చేయాలన్నారు. కార్యక్ర మంలో 325 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు వచ్చాయని, వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గోరుకల్లు నిర్మాణాన్ని పూర్తి చేయాలి

నంద్యాల(అర్బన్): గోరుకల్లు రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని రాయలసీమ సాగు నీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామి రెడ్డి డిమాండ్ చేశారు. రిజర్వాయర్‌లో అధిక స్థాయిలో నీటి నిల్వలు చేపట్టామంటూ స్థానిక నాయకులు గొప్పలు చెప్పుకోవడం మినహా చేసిం దేమీ లేదన్నారు. పట్టణంలోని ఆ సమితి కార్యాల యంలో సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒడంబడికను గౌరవిస్తూ సీమలో చేపట్టిన ఏకైక ప్రాజెక్టు ఎస్సార్బీసీ అని అన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అంజయ్య ముఖ్యమంత్రిగా ఎస్సా ర్బీసీ ప్రాజెక్టు నిర్మాణానికి అంకురార్పణ చేశార న్నారు. దీని ద్వారా సీమలోని 1.90లక్షల ఎకరాలకు నీరు అందించే అవకాశం కలిగిందన్నారు. ఈ ప్రాజెక్టుకు గుండెకాయలాంటి గోరుకల్లు రిజర్వా యర్ నిర్మాణం పూర్తి చేయడంలో పాలకులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. శ్రీశైలం రిజ ర్వాయర్‌లో నీరు ఉన్నప్పుడు బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున కాల్వకు వదిలి గోరుకల్లు రిజర్వాయర్ నిం పడానికి అవకాశం ఉందన్నారు. అయితే, నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేయలేని పరిస్థితి అన్నారు. ఈ ప్రభా వం ఆయకట్టు రైతులపై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గోరుకల్లు రిజర్వాయర్ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఎప్పుడు ఏ ముప్పు వాటిల్లుతుందోనని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండండి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

శిరివెళ్ల: అతిసారంపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రాథమిక డాక్టర్ ముఖేష్ కుమార్ అన్నారు. అతి సారం మాసోత్సవాలపై సోమవారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అతిసారా వ్యాప్తి, నివారణ, తీసుకోవల్సిన జాగ్రత్తలను సిబ్బందికి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం లో దోమలు, ఈగల వలన విష జ్వరాలు పెరుగు తాయన్నారు. అదేవిధంగా కలుషిత నీరు, ఆహారం వలన అతి సారం వ్యాప్తి చెందుతుందన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా పంచాయతీ, ఆర్‌డ బ్ల్యూఎస్ శాఖల అధికారులతో చర్చించాలన్నారు. ఒక రోజుల్లో రెండు లేదా మూడు సార్లు పలుచగా విరేచనాలు అయితే అది అతిసారేనని భావించాల న్నారు. నివారణకు వెంటనే విటమిన్ ఏ సిరప్ తాగించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాం మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సొంత మండలాల్లోనే నియమించాలి



రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సర్వేయర్లు

ఉయ్యాలవాడ: సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల పరిధిలోనే బదిలీలు చేపట్టాలని గ్రామ సర్వేయర్ల మండల శాఖ అధ్యక్షుడు మధుబాబు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేది కలో తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహే శ్వరరావుకు గ్రామ సర్వేయర్లు కలిసి విన్నవించారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేయాలని కోరారు. తర్వాత రెవెన్యూ కార్యాలయం ఎదుట నిర సన కార్యక్రమం చేపట్టారు. గ్రేడు 3 నుంచి గ్రేడు 2కు హోదా మార్చారని, పే స్కేలులో కూడా మార్పులు చేయాలన్నారు. అర్హత కలిగిన వారందరికీ పదోన్నతి వచ్చేలా సర్వీస్ రూల్స్‌లో తగిన మార్పులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్లు వెంకటేశ్వరరెడ్డి, పుల్లయ్య, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: తమకు సొంత మండలాల్లో పనిచేసే వెసు లుబాటు కల్పించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరి ష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం వారు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. నేషనల్ ఇంక్రిమెంట్లు, జాబ్ చార్ట్ అమలు చేయాల న్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా పే స్కేల్ వర్తింపు చేయాలన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ కిశోర్‌కు వినతి పత్రం అందజేశారు

అంతర్ జిల్లాల బదిలీలు వెంటనే చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అంతర్ జిల్లాల బదిలీలు వెంటనే చేపట్టాలని పీఆర్‌టీయూ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ 2021 నుంచి ఇంత వరకు అంతర్ జిల్లాల బదిలీలు జరగకపోవడంతో వేరే జిల్లాలో పని చేస్తున్న భార్యాభర్తలు చాలా ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కూటమి ప్రభుత్వం అంతర్‌జిల్లాల బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. సమా వేశంలో పీఆర్‌టీయూ నాయకులు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మరక్షణే ధ్యేయం



శ్యాంప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ జిల్లా కార్యాలయం లో జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో సోమవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మరక్షణే ధ్యేయంగా భారతీయ జన సంఘ్‌ను స్థాపించిన మార్గదర్శి శ్యాంప్రసాద్ ముఖర్జీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, అరుణ, చాందిని, మధు గోపాల్, బాలముని, ఈశ్వర్, ఆచార్య రామ సుబ్బారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

గోస్పాడు: దేశ సమగ్రత, సమైక్యతకు బీజేపీ కృషి చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధు అన్నారు.డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని మండలంలోని యాళ్లూరు గ్రామంలో పార్టీ నాయకుడు నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యం లో సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయ కులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు..



ఆళ్లగడ్డ నుంచి పోరుకు బయలు దేరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఆళ్లగడ్డ: మాట తప్పి.. వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ తీరుకు నిర సనగా జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమానికి ఆళ్లగడ్డ నుంచి పెద్ద సంఖ్యలో యువత బయలు దేరింది. వైఎస్సా ర్సీపీ యువజన విభాగం నాయకుడు పలసాని మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని యు వత స్థానిక పార్టీ కార్యాలయం చేరుకుని అక్కడి నుంచి నినాదాలు చేస్తూ నంద్యాలకు బయలు దేరారు.

డీపీఆర్‌ఓగా సీహెచ్ పురుషోత్తం

నంద్యాల: నంద్యాల సమాచార, పౌర సంబంధాల జిల్లా అధికారిగా సోమవారం సీహెచ్ పురుషోత్తం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీపీఆర్‌ఓగా పని చేస్తున్న మల్లికార్జున అన్నమయ్య జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పురుషోత్తం మాట్లాడుతూ జిల్లా కలె క్టర్ రాజకుమారి సలహాలు, సూచనలు పాటిస్తూ శాఖాపరంగా జర్నలిస్టుల సంక్షేమానికి అవసర మైన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు, అధికార కార్యక్రమాలను మీడియా ద్వారా విస్తృతం చేస్తామ న్నారు. నూతన డీపీఆర్‌ఓకు సిబ్బంది పూల బొ కేలు అందజేసి అభినందనలు తెలిపారు. కాగా బదిలీపై వెళ్తున్న డీపీఆర్‌ఓ మల్లికార్జునను సిబ్బంది కలెక్టరేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

28న జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హెట్రో ల్యాబ్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం చేసేం దుకు ఇండస్ట్రీయల్ స్కిల్ ట్రెనింగ్ ప్లేమెంట్ ప్రోగ్రాం ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు ఇంటర్, ఐటీఐ, ఫిట్టర్, బీఎస్సీ కంప్యూటర్ కెమిస్ట్రీ, బీకాం కంప్యూ టర్, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ విద్యార్హత కలిగి ఉం డాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 25 సంవత్స రాల వయస్సు గల అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ 99514 00588 నంబరును సంప్రదించాలన్నారు.

పీహెచ్‌సీలో ఐదుగురు బదిలీ

రుద్రవరం:స్థానిక పీహెచ్‌సీ నుంచి ఐదుగురు ఉద్యోగులు బదిలీ అయినట్లు వైద్యాధికారిని శ్రావణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎం పీహెచ్ఈఓ బాబయ్యను డబ్ల్యూ కొత్తపల్లెకు, ఫార్మ సిస్టు మహేశ్వరీని చాపిరేవులకు, సబార్డినేట్ శ్రీని వాసులను గోస్పాడుకు, విష్ణుతేజను కర్నూలుకు, పీఎంఓఓ మహేశ్వరెడ్డిని పారు మంచాలకు బదిలీ అయ్యారని వెల్లడించారు. చిత్తూరు జిల్లా పూత లపట్టు నుంచి పీఎంఓఓగా ఉమామహేశ్వ రి, సత్య సాయి జిల్లా ముదిగుబ్బ నుంచి ఎంపీహెచ్ఈఓగా రవీంద్రనాథ్ ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఖాళీగా ఉన్న టైపిస్టు పోస్టు భర్తీ అయ్యింది. కారుణ్య నియామకం కింద ఈ పోస్టులో రూపశి రాజ్‌ను ప్రభుత్వం నియమిం చినట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. సదరు ఉద్యోగి నియామక పత్రాన్ని సోమవారం మండల అధికారులకు అంద జేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, సినియర్ అసిస్టెంట్ నరసింహుడు, జూనియర్ అసిస్టెంట్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పిల్లలకు ఉచిత విద్య

రుద్రవరం: కుల మతాలకు అతీతంగా పేదల పిల్ల లకు ఉచిత విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆర్ట్ లివింగ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులో ఒకరైన మనోహర్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని హరినగరం సమీపంలో ఉన్న నవ అహోబిలం ప్రాంగణంలో నూతన భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇందులో గిరిజనులతో పాటు ఇతర సామాజిక వర్గాల పిల్లలకు ఉచిత భోజన వసతితో విద్యా బుద్ధులు నేర్పిస్తామని, అలాగే వేద పాఠశాల కొనసాగిస్తామన్నారు.

రైతులకు అన్యాయం

రుద్రవరం: రెవెన్యూ అధికారులు చేసే తప్పుల వల్ల సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతుందని సీపీఐ ఆళ్లగడ్డ, రుద్రవ రం మండలాల కార్యదర్శులు భాస్కర్, బాలనరసింహుడు అన్నారు. భూ రీసర్వేలో పలువురు రైతుల పొలాలు జాయింట్ ఎల్‌పీఎం పడటంతో వారు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారన్నారు. నాగులవరం నరసింహుడు అనే రైతుకు నాలుగెక రాల పొలం ఉండగా ఆయన పేరు మీద 60 ఎకరా లు,పెద్దకంబలూరుకు చెందిన నారాయణకు రెండె కరాలు ఉండగా ఏడెకరాలు ఉన్నట్లు, నాగేంద్రకు మూడెకరాలుండగా 22 ఎకరాలు ఉన్నట్లు ఆన్‌లైన్ చేశారని చెప్పారు. అధికారులు స్పందించి ఇలాంటి తప్పులను వెంటనే సరిదిద్దాలని కోరారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

సంక్షేమ పథకాలు అమలు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నంద్యాల(న్యూటౌన్): తమ డిమాం డ్ల సాధనకు అంగన్‌వాడీలు కదిలివ చ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు సంక్షేమ పథ కాలు వర్తింపజేయాలని నినదిం చారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్ట రేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన కార్యక్రమం జరిగింది. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేభారాణి, నిర్మల అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, తోటమద్దులు, మహమ్మద్‌గౌస్, లక్ష్మణ్ మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు అతీగతీ లేదన్నారు. అంగన్‌వాడీల గోడు పట్టించుకో వడం లేదన్నారు. ఎన్నికల హామీ మేరకు అంగన్‌వా డీలకు కొత్త రేషన్ కార్డులు, రిటైర్డు అయిన వారికి వృ ద్ధాప్య పింఛన్లు, ఒంటరి మహిళలకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ రామునాయక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాలు హరిత, శివలక్ష్మి, మంజుల, శ్రీదేవి, రేణుక, నాగమణి, పద్మా తదితరులు, పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, రుణాలు వెంటనే ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఆ కమిటీ పిలుపు మేరకు నాయకులు, రైతులు సోమవారం నంద్యాల కలెక్ట రేట్ వద్ద ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ రామునాయక్‌కు అందజేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు కూటమి ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు, రుణాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రైతాంగాన్ని ఆదుకునే ఆలోచన ఈ సర్కారుకు లేద న్నారు. గతేడాది పండించిన పంటలకు సైతం మద్దతు ధర కల్పించలేదని మండిపడ్డారు. ఎన్ని కల్లో రైతు పెట్టుబడి కింద రూ.20వేలు ఇస్తామని, ఇంత వరకు పైసా ఇవ్వలేదని విమర్శించారు. కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించా లన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, రమ ణయ్య శెట్టి, ఐఎఫ్‌టీయూ నాయకులు మజీద్ మియా, అరుణ్‌కుమార్, చౌడప్ప, రాంబాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

సీఓపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆర్పీలు

నంద్యాల(న్యూటౌన్): సీఆర్పీ భవానీపై దాడి చేసిన మెప్మా సీఓ లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఆర్పీలతో అదనపు పనులు చేయించరాదని, రాజకీయ నాయ కుల వేధింపులు ఆపాలని కోరుతూ సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, ఏపీ మెప్మా ఆర్పీ ఉద్యోగుల సం ఘం అధ్యక్షురాలు సుజాత, హైమావతి మాట్లా డుతూ 15వ వార్డులో విధులు నిర్వహిస్తున్న ఆర్పీ షేక్ రహమత్‌బీని సీఓ లక్ష్మీకుమారి రూ.30వేలు ఇవ్వాల ని, లేకుంటే తొలగిస్తానని బెదిరించడం జరిగిం దన్నారు. ఈ విషయాన్ని 28వ వార్డులో విధులు నిర్వ హిస్తున్న సీఆర్పీ భవానీ అందరికీ తెలియజేసిందని ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ సీఓ దాడి చేసిందన్నారు. వెంటనే సదరు అధికారిణిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ రామునాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్పీలు ప్రసన్నకుమారి, సులోచన, సత్యవతి, సువర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాల కోసం..

నంద్యాల(న్యూటౌన్): ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్ప డినప్పటి నుంచి జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వస్తుందన్నారు. దీంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. చేసిన పనికి కూడా సకాలంలో వేతనం అందడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్షుడు రాదాకృష్ణ, నారా యణ, లక్ష్మీదేవి, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 16రోజుల పండుగ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు సోమవారం 16 రోజుల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో దేవర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందుకు ముగింపుగా 16 రోజుల పండుగ చేపట్టారు. ఈ వేడుకలో భాగంగా అమ్మవారికి దేవర దున్నను బలి ఇచ్చారు. భక్తులు గండా దీపాలు, బోనాలు సమ ర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసింది.



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు